# సాక్షి
## జోగులాంబ గద్వాల

సోమవారం । 4 । డిసెంబర్ । 2023




- కట్టుదిట్టంగా భద్రత
- టెన్షన్.. టెన్షన్
- పోటీచేసిన తొలిసారే విజయం
- తండ్రి కల నెరవేర్చిన తనయుడు
- అచ్చొచ్చిన అచ్చంపేట
- నిరంజన్‌రెడ్డి కారు అద్దాలు ధ్వంసం
- నల్లమల నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలు
- చిట్టెం పర్ణికారెడ్డి భావోద్వేగం

- వివరాలు 12లో..

గరిష్టం/కనిష్టం 31.0 /24.0

**వాతావరణం**
రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత. రాత్రి కాస్త చలిగా ఉంటుంది.

### మహబూబ్‌నగర్

**యెన్నం శ్రీనివాస్‌రెడ్డి** | మెజార్టీ 18,738

వచ్చిన ఓట్లు : 87,227



సమీప ప్రత్యర్థి: వి.శ్రీనివాస్‌గౌడ్ (బీఆర్‌ఎస్), వచ్చిన ఓట్లు : 68,489

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగానికి 2001లో రాజీనామా చేసి టీఆర్‌ఎస్‌లో చేరి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. 2009లో ఆ పార్టీకి రాజీనామా చేశారు. 2012లో మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికల్లో బీజేపీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014లో ఓడిన ఆయన తిరిగి ఈ సారి పోటీ చేసి విజయం సాధించారు.

### దేవరకద్ర

**జి.మధుసూదన్‌రెడ్డి** | మెజార్టీ 1,392

వచ్చిన ఓట్లు : 88,551



సమీప ప్రత్యర్థి: ఆల వెంకటేశ్వర్‌రెడ్డి (బీఆర్‌ఎస్), వచ్చిన ఓట్లు: 87,159

న్యాయవాది వృత్తిలోనే కొనసాగుతూ జీఎంఆర్ సేవా సమితి పేరుతో సేవా కార్యక్రమాలు చేపట్టారు. 2017లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2022 నుంచి మహబూబ్‌నగర్ డీసీసీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. తొలిసారి కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేసి సంచలన విజయం సాధించారు.

### జడ్చర్ల

**జనంపల్లి అనిరుధ్‌రెడ్డి** | మెజార్టీ 15,171

వచ్చిన ఓట్లు : 90,865



సమీప ప్రత్యర్థి: చర్లకోల లక్ష్మారెడ్డి (బీఆర్‌ఎస్), ఓట్లు : 75,694

2012లో వైఎస్‌ఆర్‌సీపీలో చేరారు. 2017లో కాంగ్రెస్‌లో చేరి టీపీసీసీ ఉపాధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. తల్లి శశికళారెడ్డి రంగారెడ్డిగూడ సర్పంచ్‌గా కొనసాగుతున్నారు. తొలిసారి జడ్చర్ల ఎమ్మెల్యేగా కాంగ్రెస్ తరఫున బరిలోకి దిగి విజయం సాధించారు.


### కల్వకుర్తి

**కసిరెడ్డి నారాయణరెడ్డి** | మెజార్టీ 5,410

వచ్చిన ఓట్లు: 75,858

సమీప ప్రత్యర్థి : తల్లోజు ఆచారి (బీజేపీ)
వచ్చిన ఓట్లు : 70,448

తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014 ఎన్నికల్లో ఆటో గుర్తుపై స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. 2016లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా టీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసి గెలుపొందారు. 2022లో తిరిగి అదే స్థానం నుంచి రెండోసారి నెగ్గారు. తాజాగా కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు.



# హస్తందే హవా

## ఉమ్మడి పాలమూరులో 14 అసెంబ్లీ స్థానాల్లో 12 గెలుపు



విజయోత్సవ ర్యాలీలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభంజనం సృష్టించింది. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని 14 స్థానాల్లో 12 కైవసం చేసుకుంది. మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, వనపర్తి, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాల్లో ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. ఎన్నికల అధికారులు తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లు, ఆ తర్వాత ఈవీఎంలలో ఓట్ల లెక్కింపు చేపట్టారు. మహబూబ్‌నగర్, జడ్చర్ల, షాద్‌నగర్, దేవరకద్ర, మక్తల్, నారాయణపేట, కొడంగల్, వనపర్తి, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట, కల్వకుర్తిలో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. గద్వాల, అలంపూర్‌లో మాత్రం బీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలుపొందారు. మక్తల్, కొల్లాపూర్, కల్వకుర్తి మినహా బీజేపీ అభ్యర్థులు కనీస ప్రభావం చూపించలేకపోయారు.

**దేవరకద్ర: రౌండ్‌రౌండ్‌కూ ఉత్కంఠ**

మహబూబ్‌నగర్ జిల్లాలోని దేవరకద్రలో చివరి రౌండ్‌లో ఫలితం తేలింది. రౌండ్ రౌండ్‌కూ ఉత్కంఠ నెలకొంది. చివరి రౌండ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి జి.మధుసూదన్‌రెడ్డికి 907ఓట్ల మెజార్టీ రాగా.. పోస్టల్ బ్యాలెట్‌తో కలుపుకుని మొత్తం 1,392 ఓట్ల మెజార్టీతో తాజా మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆల వెంకటేశ్వర్‌రెడ్డిపై ఆయన విజయం సాధించినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు.

**తొలిసారిగా గెలుపొందిన వారు..**

- జనంపల్లి అనిరుధ్‌రెడ్డి (కాంగ్రెస్- జడ్చర్ల)
- చిట్టెం పర్ణికారెడ్డి (కాంగ్రెస్-నారాయణపేట)
- జి.మధుసూదన్‌రెడ్డి (కాంగ్రెస్-దేవరకద్ర)
- వాకిటి శ్రీహరి (కాంగ్రెస్ - మక్తల్)
- వీర్లపల్లి శంకర్ (కాంగ్రెస్ - షాద్‌నగర్)
- కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి (కాంగ్రెస్-నాగర్‌కర్నూల్)
- కసిరెడ్డి నారాయణరెడ్డి (కాంగ్రెస్ - కల్వకుర్తి)
- మేఘారెడ్డి (కాంగ్రెస్ - వనపర్తి)
- విజయుడు (బీఆర్‌ఎస్ - అలంపూర్)
- ఈ తొమ్మిది మంది తొలిసారిగా శాసనసభలో అడుగుపెట్టనుండగా.. వారందరూ యువనాయకులే. వీరిలో నాగర్‌కర్నూల్, నారాయణపేటలో గెలుపొందిన రాజేష్‌రెడ్డి, పర్ణికారెడ్డి డాక్టర్లు కావడం విశేషం. అదేవిధంగా అచ్చంపేటలో విజయం సాధించిన వంశీకృష్ణ వైద్యుడే.

**మంత్రులకు తప్పని ఓటమి**

మహబూబ్‌నగర్, వనపర్తిలో బీఆర్‌ఎస్‌కు చెందిన తాజా మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డికి చుక్కెదురైంది. మహబూబ్‌నగర్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి శ్రీనివాస్‌గౌడ్‌పై కాంగ్రెస్ అభ్యర్థి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి 18,738 ఓట్ల మెజార్టీతో గెలిచారు. వనపర్తిలో నిరంజన్‌రెడ్డిపై మేఘారెడ్డి 25,320 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు.

**వాడిన 'కమలం'**

ఎన్నికల క్రమంలో బీజేపీకి చెందిన ప్రధాని మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ తదితర అగ్రనేతలు పాలమూరులోని పలు నియోజకవర్గాలను చుట్టేశారు. బండి, ఈటల రాజేందర్ వంటి స్టార్ క్యాంపెయినర్లు, వివిధ రాష్ట్రాలకు చెందిన పలువురు ముఖ్యమంత్రులు, మంత్రులు పార్టీ అభ్యర్థుల తరఫున భారీ బహిరంగ సభలు, ప్రచారంతో హోరెత్తించారు. కానీ పోలింగ్ నాటికి చతికిలపడినట్లు కౌంటింగ్ సందర్భంగా స్పష్టమైంది. కల్వకుర్తి, మక్తల్ మినహా మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర, నారాయణపేట, వనపర్తి, అచ్చంపేట, షాద్‌నగర్, కొడంగల్, గద్వాల, అలంపూర్, కొల్లాపూర్‌లో డిపాజిట్ కూడా దక్కలేదు. కల్వకుర్తిలో గతంలో స్వల్ప ఓట్లతో ఓటమి పాలైన ఆచారికి ఆరోసారి నిరాశే ఎదురైంది. నాగర్‌కర్నూల్‌లో జనసేన అభ్యర్థికి సైతం డిపాజిట్ రాలేదు.

### కొడంగల్..

**ఎనుముల రేవంత్ రెడ్డి** | మెజార్టీ 32,532

వచ్చిన ఓట్లు : 1,07,429

సమీప ప్రత్యర్థి: పట్నం నరేందర్‌రెడ్డి (బీఆర్‌ఎస్)
వచ్చిన ఓట్లు : 74,897

మొదటిసారి మిడ్జిల్ జెడ్పీటీసీగా గెలుపొందారు. పదవిలో ఉండగానే పాలమూరు జిల్లా నుంచి ప్రాదేశిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా (స్వతంత్రం) పోటీ చేసి గెలుపొందారు. ఎమ్మెల్సీగా ఉండగానే కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 2009లో టీడీపీ నుంచి గెలిచారు. 2014లో రెండోసారి ఇదే స్థానం నుంచి నెగ్గారు. 2018లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓడిపోగా.. ఈసారి మరోసారి బరిలో నిలిచి భారీ మెజార్టీతో విజయం సాధించారు.




### కొల్లాపూర్

**జూపల్లి కృష్ణారావు** | మెజార్టీ 29,931

వచ్చిన ఓట్లు: 93,609

సమీప ప్రత్యర్థి: బీరం హర్షవర్ధన్‌రెడ్డి (బీఆర్‌ఎస్) వచ్చిన ఓట్లు : 63,678

జూపల్లి కృష్ణారావు ఆరోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. బ్యాంక్ ఉద్యోగానికి రాజీనామా చేసి 1999లో క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చారు. 1999, 2004, 2009, 2012, 2014లో వరుసగా ఐదుసార్లు విజయం సాధించారు. 2018లో హర్షవర్ధన్‌రెడ్డి చేతిలో అనూహ్యంగా ఓడినా.. ఈసారి కాంగ్రెస్ నుంచి బరిలో దిగి నెగ్గారు.



### నాగర్‌కర్నూల్

**కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి** | మెజార్టీ 5,248

వచ్చిన ఓట్లు ఓట్లు : 87,161

సమీప ప్రత్యర్థి: మర్రి జనార్దన్‌రెడ్డి (బీఆర్‌ఎస్)
వచ్చిన ఓట్లు : 81,913

మొదటిసారి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి పోటీ చేసిన తొలిసారే ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆయన తండ్రి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి 1999, 2004, 2009, 2012, 2014 వరుసగా ఐదుసార్లు పోటీ చేసినా గెలవలేదు. 24 ఏళ్ల తర్వాత తనయుడు బరిలోకి దిగి తండ్రి కలను నెరవేర్చారు.



### వనపర్తి

**తూడి మేఘారెడ్డి** | మెజార్టీ 25,320

ఓట్లు : 1,07,115

సమీప ప్రత్యర్థి: సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి (బీఆర్‌ఎస్), ఓట్లు : 81,795

2003లో టీడీపీలో చేరి రాజకీయ ఆరంగేట్రం చేశారు. 2015లో బీఆర్‌ఎస్‌లో చేరి.. ఆరేళ్ల పెద్దమందడి మండలం పార్టీ అధ్యక్షుడిగా పనిచేశారు. 2019 నుంచి పెద్దమందడి ఎంపీపీగా కొనసాగుతున్నారు. మంత్రి నిరంజన్‌రెడ్డితో విభేదించి ఈ ఏడాది కాంగ్రెస్‌లో చేరారు. సీనియర్ నేత చిన్నారెడ్డిని కాదని టికెట్ దక్కించుకొని పోటీ చేసిన తొలిసారే ఎమ్మెల్యేగా గెలిచారు.



### అత్యధికంగా వంశీకృష్ణ.. అత్యల్పంగా జీఎమ్మార్‌కు..

ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో గెలుపొందిన అభ్యర్థుల మెజార్టీని పరిశీలిస్తే అచ్చంపేట కాంగ్రెస్ అభ్యర్థి చిక్కుడు వంశీకృష్ణ 49,326 ఓట్ల ఆధిక్యతతో గెలుపొంది మొదటి స్థానంలో నిలిచారు. ఆ తర్వాత కొడంగల్‌లో కాంగ్రెస్ అభ్యర్థి, టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి 32,532 ఓట్ల మెజార్టీతో రెండో స్థానం, అలంపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి విజయుడు 30,573 ఓట్ల ఆధిక్యతతో మూడో స్థానంలో ఉన్నారు. ఆ తర్వాత నాలుగు, ఐదు, ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది, పది స్థానాల్లో కాంగ్రెస్‌కు చెందిన కొల్లాపూర్, వనపర్తి, మహబూబ్‌నగర్, మక్తల్, జడ్చర్ల, నారాయణపేట, షాద్‌నగర్ అభ్యర్థులు జూపల్లి (29,931), మేఘారెడ్డి (25,320), యెన్నం శ్రీనివాస్‌రెడ్డి (18,738), వాకిటి శ్రీహరి (17,525), అనిరుధ్‌రెడ్డి (15,171), పర్ణికారెడ్డి (7,951), వీర్లపల్లి శంకర్ (7,128) ఉన్నారు. 11వ స్థానంలో గద్వాలకు చెందిన బీఆర్‌ఎస్ అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి (7,036) నిలిచారు. 12 స్థానంలో కాంగ్రెస్ కల్వకుర్తి అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి (5,410), 13వ స్థానంలో నాగర్‌కర్నూల్ అభ్యర్థి కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి (5,248) నిలవగా.. దేవరకద్ర కాంగ్రెస్ అభ్యర్థి జి.మధుసూదన్‌రెడ్డి (1,392) అత్యల్ప మెజార్టీతో చివరిస్థానంలో నిలిచారు. 2018లో అత్యధిక మెజార్టీ 57,775 ఓట్లతో మహబూబ్‌నగర్ నుంచి అప్పటి బీఆర్‌ఎస్ అభ్యర్థి, తాజా మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ గెలుపొందగా.. ఆ రికార్డ్‌ను ఎవరూ సాధించలేకపోయారు.

### 'చల్ల'గా విజయుడై..

అలంపూర్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి విజయుడు గెలుపొందడం హాట్‌టాపిక్‌గా మారింది. సిట్టింగ్ ఎమ్మెల్యే అబ్రహంను ఖరారు చేసిన తర్వాత.. పలు పరిణామాలు చోటుచేసుకున్న విషయం తెలిసిందే. అబ్రహంను విభేదించిన ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి అనూహ్యంగా ఉపాధి హామీ పథకం ఉద్యోగిగా ఉన్న తన అనుచరుడు విజయుడిని తెరపైకి తీసుకొచ్చారు. అధినేత కేసీఆర్‌ను ఒప్పించి విజయుడికే బీఫామ్ ఇప్పించారు. ఆ తర్వాత మందా జగన్నాథం, అబ్రహం కాంగ్రెస్‌లోకి వెళ్లగా.. అందరూ సంపత్‌దే గెలుపు అని భావించారు. కానీ అనూహ్యంగా విజయుడు ఉమ్మడి జిల్లాలోనే రెండో అత్యధిక ఓట్లతో గెలుపొందడం హాట్ టాపిక్‌గా మారింది. చల్లా చాతుర్యం ఆయనను గెలిపించిందని.. కేసీఆర్‌కు ఇచ్చిన మాట నిలుపుకున్నారని ఆ పార్టీ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది.

### నారాయణపేట

**చిట్టెం పర్ణికారెడ్డి** | మెజార్టీ 7,951

వచ్చిన ఓట్లు : 84,708

సమీప ప్రత్యర్థి: ఎస్.రాజేందర్‌రెడ్డి (బీఆర్‌ఎస్)
వచ్చిన ఓట్లు: 76,757

దివంగత మాజీ ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డి మనువరాలు. తండ్రి దివంగత చిట్టెం వెంకటేశ్వర్‌రెడ్డి పీసీసీ సభ్యుడు. హైదరాబాద్‌లో రేడియాలజిస్టు చదువుతూనే ఎన్నికల బరిలో దిగారు. ఆమె మేనమామ, మాజీ డీసీసీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి ఆశీస్సులతో కాంగ్రెస్ నుంచి తొలిసారి పోటీ చేసి సంచలన విజయం సాధించారు.




### అచ్చంపేట

**చిక్కుడు వంశీకృష్ణ** | మెజార్టీ 49,326

వచ్చిన ఓట్లు: 1,15,337

సమీప ప్రత్యర్థి: గువ్వల బాలరాజు (బీఆర్‌ఎస్)
వచ్చిన ఓట్లు : 66,011

1994లో బీఎస్పీ నుంచి రాజకీయాల్లోకి వచ్చారు. మొదటిసారి 1999లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. తొలిసారిగా 2004లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. తిరిగి 2009, 2014, 2018లో ఓడిపోయారు. ప్రస్తుతం నాగర్‌కర్నూల్ డీసీసీ అధ్యక్షుడిగా ఉండి.. మరోసారి పోటీ చేసి భారీ మెజార్టీతో నెగ్గారు.



## గద్వాలలో బీఆర్‌ఎస్‌దే హవా..

గద్వాల రూరల్: రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ హవా కొనసాగినా.. గద్వాలలో మాత్రం ఫలితం అందుకు భిన్నంగా వచ్చింది. నియోజకవర్గ ప్రజలు రెండోసారి బీఆర్‌ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికే జైకొట్టారు. కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి, జెడ్పీ చైర్‌పర్సన్ సరితపై బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి 7,036 ఓట్ల మెజార్టీ సాధించారు.

**ఆది నుంచి ఆధిక్యంలోనే..**

ఈవీఎంల ఓట్ల లెక్కింపు ప్రారంభించినప్పటి నుంచి బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆధిక్యంలో దూసుకెళ్లారు. ధరూర్ మండలం నుంచి ప్రారంభమైన లెక్కింపు ప్రక్రియ చివరిగా గద్వాల పట్టణం, మండలంతో పూర్తయింది. మొత్తం 2,56,605 ఓట్లకుగాను.. 2,13,274 ఓట్లు పోలయ్యాయి. 20 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 14 టేబుళ్లు, 22 రౌండ్లుగా విభజించి లెక్కింపు ప్రక్రియ చేపట్టారు.


- బీఆర్‌ఎస్ పార్టీకి గట్టు, కేటీదొడ్డి, ధరూరు మండలాల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థికి 9,111 ఓట్ల మెజార్టీ వచ్చింది. మల్దకల్ మండలంలో కాంగ్రెస్‌కు 965 ఓట్ల ఆధిక్యం రాగా.. గద్వాల మండలం, పట్టణంలో నువ్వా నేనా అన్న తరహాలో పోటీ నెలకొంది. ఇక్కడ 9,111 మెజార్టీ క్రమంగా తగ్గుతూ చివరకు 7,036 ఓట్ల తేడాతో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి విజయం సాధించారు.


ఆర్‌ఓ చేతులమీదుగా ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

### గద్వాల

**బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి** | మెజార్టీ 7,036

వచ్చిన ఓట్లు : 94,097



సమీప ప్రత్యర్థి : సరిత (కాంగ్రెస్), వచ్చిన ఓట్లు : 87,061

బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. 1996లో గద్వాల రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించారు. 2009లో టీడీపీ నుంచి, 2014లో బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2018లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి నిలబడి 28,260 ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి డీకే అరుణను ఓడించి తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు.

## విజయుడే విజేత..

అలంపూర్: రాష్ట్రవ్యాప్తంగా హస్తం హవా కొనసాగినా.. అలంపూర్‌లో మాత్రం కారు జోరుకు అడ్డుకట్ట వేయలేకపోయింది. బీఆర్‌ఎస్ అభ్యర్థి విజయుడు మొదటి రౌండ్ నుంచి చివరి రౌండ్ వరకు ఆధిక్యంలోనే కొనసాగారు. ప్రత్యేక రాష్ట్రంలో జరిగిన మూడు ఎన్నికల్లో రెండోసారి విజయాన్ని బీఆర్‌ఎస్ తన ఖాతాలో వేసుకుంది. అభ్యర్థుల మధ్య ఉత్కంఠ పోరు ఉంటుందని అందరూ భావించినా.. ఓటర్లు మాత్రం ఏకపక్షంగా నిలిచి గెలుపును సునాయసంగా మార్చారు. దీంతో బీఆర్‌ఎస్ భారీ మెజార్టీని దక్కించుకుంది.

**సాయంత్రం వరకు సాగిన లెక్కింపు..**

జిల్లాకేంద్రంలోని గోనుపాడు వద్ద ఉన్న పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం సాయంత్రం వరకు ఓట్ల లెక్కింపు జరిగింది. ఎన్నికల కౌంటింగ్ అబ్జర్వర్ అనురాధ, ఆర్‌ఓ చంద్రకళ స్ట్రాంగ్‌రూం నుంచి ఈవీఎంలను కౌంటింగ్ హాల్‌కు తీసుకొచ్చారు. రౌండ్లవారీగా ఓట్లు లెక్కించి ఫలితాలు వెల్లడించారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కించారు.


రిటర్నింగ్ అధికారి చంద్రకళ నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న విజయుడు

14 టేబుల్స్ ఏర్పాటు చేసి 21 రౌండ్లలో లెక్కింపు చేపట్టారు. చివరగా వీవీప్యాట్లలోని స్లిప్‌లను లెక్కించి చివరి రౌండ్ ఫలితాలు వెల్లడించారు.

**ఆది నుంచి అధిక్యమే..**

పోటీలో 13 మంది అభ్యర్థులు ఉండగా.. ప్రధాన పోరు బీఆర్‌ఎస్-కాంగ్రెస్ మధ్యే కొనసాగింది. తొలి రౌండ్ నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థి విజయుడు కాంగ్రెస్ అభ్యర్థి సంపత్‌కుమార్‌పై అధిక్యత కనబరుస్తూ 30,573 ఓట్ల భారీ మెజార్టీతో విజయకేతనం ఎగురవేశారు. ఈవీఎంలు లెక్కించగా 1,03,770 ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 290 వచ్చాయి.


### అలంపూర్

**విజయుడు** | మెజార్టీ 30,573

వచ్చిన ఓట్లు : 1,04,060

సమీప ప్రత్యర్థి: ఎ.సంపత్ కుమార్ (కాంగ్రెస్), వచ్చిన ఓట్లు: 73,487

జాతీయ ఉపాధి హామీ పథకంలో ఉద్యోగిగా ఉన్న విజయుడు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి ప్రధాన అనుచరుడిగా గుర్తింపు ఉంది. సిట్టింగ్ ఎమ్మెల్యే అబ్రహంను కాదని పట్టుబట్టి విజయుడికి టికెట్ దక్కేలా ఎమ్మెల్సీ కృషి చేశారు. ఏమాత్రం రాజకీయ అనుభవం లేకున్నా.. తొలిసారి ఎన్నికల బరిలో దిగి భారీ విజయం సాధించారు.



### షాద్‌నగర్

**కె.శంకరయ్య (వీర్లపల్లి శంకర్)** | మెజార్టీ 7,128

వచ్చిన ఓట్లు : 77,817

సమీప ప్రత్యర్థి: ఎల్లగమోని అంజయ్య యాదవ్ (బీఆర్‌ఎస్), వచ్చిన ఓట్లు: 70,689

శంకరయ్య 1992లో రాజకీయ రంగ ప్రవేశం చేసి.. 1995 నుంచి వరుసగా రెండుసార్లు వీర్లపల్లి సర్పంచ్‌గా గెలిచారు. యూత్ లీడర్‌గా ఒక్కోమెట్టు ఎదిగి, వివిధ పదవులు చేపట్టారు. 2018లో బీఎస్పీ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. తిరిగి కాంగ్రెస్‌లో చేరి టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఈసారి అసెంబ్లీకి పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు.



### మక్తల్

**వాకిటి శ్రీహరి** | మెజార్టీ 17,525

వచ్చిన ఓట్లు : 74,917

సమీప ప్రత్యర్థి: చిట్టెం రామ్మోహన్‌రెడ్డి (బీఆర్‌ఎస్), ఓట్లు: 57,392

2001 - 2006లో మక్తల్ మేజర్ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. 2014 - 2018 వరకు మక్తల్ జెడ్పీటీసీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 2014 - 2018 జిల్లా ప్రధాన కార్యదర్శిగా, 2022 నుంచి డీసీసీ అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. తొలిసారిగా ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించారు.







పాలమూరు యూనివర్సిటీలోని కౌంటింగ్ కేంద్రం వద్ద వివరాలు రాసుకుంటున్న ఆయా పార్టీల ఏజెంట్లు, మీడియా ప్రతినిధులు, కౌంటింగ్ కేంద్రం పరిసరాల్లో నినాదాలు చేస్తున్న కార్యకర్తలు

## పోటీచేసిన తొలిసారే విజయం

- జడ్చర్ల సెగ్మెంట్‌లో అనిరుధ్‌రెడ్డిదే పైచెయ్యి

**జడ్చర్ల టౌన్:** జడ్చర్ల సెగ్మెంట్‌లో పోటీ చేసిన తొలిసారే విజయం సాధించిన వారిలో ఒకరిగా జనంపల్లి అనిరుధ్‌రెడ్డి నిలిచారు. ప్రస్తుత ఎన్నికల్లో మొత్తం 15మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలవగా.. ప్రధానంగా బీఆర్‌ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ నుంచి అనిరుధ్‌రెడ్డిల మధ్యే పోటీ నెలకొంది. హోరాహోరీ పోరులో అనిరుధ్‌రెడ్డి 14,630 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. ఇక మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి హ్యాట్రిక్ అందని ద్రాక్షే అయ్యింది. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 17 పర్యాయాలు ఎన్నికలు నిర్వహించగా.. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన చరిత్ర ఎవరికీ లేకుండా పోయింది. 1962లో నియోజకవర్గం ఏర్పడగా.. లక్ష్మీనర్సింహారెడ్డి, కొత్త కేశవులు, నర్సప్ప, కృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఎర్రసత్యం, ఎర్రశేఖర్‌లు పోటీ చేసిన తొలిసారే విజయం సాధించారు. వీరి వరసలో అనిరుధ్‌రెడ్డి వచ్చి చేరారు.

### హ్యాట్రిక్ దక్కని లక్ష్మారెడ్డి..

ఇప్పటి వరకు మూడుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించిన లక్ష్మారెడ్డికి ఈ ఎన్నికల్లో ఓటమితో హ్యాట్రిక్ దక్కకుండా పోయింది. 2004 ఎన్నికలతో పాటు 2014, 2018 ఎన్నికల్లో వరస విజయాలు సాధించారు. ఈ పర్యాయం గెలిస్తే హ్యాట్రిక్ సాధిస్తారని అందరూ భావించగా.. నిరాశ తప్పలేదు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు వరసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వారు ఎవరూ లేరంటే అతిశయోక్తి లేదు.

# కట్టుదిట్టంగా భద్రత

- మహబూబ్‌నగర్ కౌంటింగ్ కేంద్రంలో పర్యవేక్షించిన ఏఎస్పీ, డీఎస్పీలు
- కార్యకర్తలను అదుపు చేసిన పోలీసులు





పీయూలోని కౌంటింగ్ కేంద్రం వద్దకు భారీ తరలివచ్చిన వివిధ పార్టీల కార్యకర్తలు

**మహబూబ్‌నగర్ క్రైం:** అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపును ఆదివారం జిల్లాకేంద్రంలోని పాలమూరు యూనివర్సిటీ పరీక్షల విభాగం భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కౌంటింగ్ కేంద్రం చుట్టూ పరిసర ప్రాంతాలతోపాటు ఆవరణలో భారీ పోలీస్ భద్రత ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభంకంటే ముందే ఉద్యోగులు, సిబ్బంది, పార్టీల ఏజెంట్లను గుర్తింపు కార్డులు చూసి పోలీసులు లోపలికి అనుమతించారు. ప్రధానంగా కౌంటింగ్ జరుగుతున్న భవనాన్ని కేంద్ర బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓట్లు లెక్కింపును ఒకే ప్రాంతంలో పెట్టడం వల్ల ఉదయం నుంచి సాయంత్రం వరకు హడావుడి కన్పించింది. ఓట్ల లెక్కింపు సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ మూడంచెల భద్రత వ్యవస్థ ఏర్పాటు చేశారు. ఇందు కోసం కేంద్ర బలగాలు, టీఎస్‌ఎస్‌పీ, సివిల్ పోలీసులను ఉపయోగించారు.

**పెరిగిన ఉత్సాహం**

అసెంబ్లీ ఓట్ల లెక్కింపులో మొదటి రౌండ్ ప్రారంభమైన తర్వాత జిల్లాలోని మూడు నియోజకవర్గాల అభ్యర్థులు ముందంజలో ఉండటంతో కార్యకర్తలు రోడ్లపైకి చేరుకొని ఉత్సాహం చూపారు. కౌంటింగ్‌లో రౌండ్‌లు పెరుగుతున్న కొద్దీ చాలామంది కార్యకర్తలు కౌంటింగ్ కేంద్రానికి చేరుకొని కాంగ్రెస్ పార్టీ జెండాలు పట్టుకొని ర్యాలీలు తీశారు. కార్యకర్తలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ శుభాకాంక్షలు చెప్పుకొన్నారు.

**కట్టడి చర్యలు**

ఎన్నికల ఫలితాలకు సంబంధించి రౌండ్లు పూర్తి అవుతున్న సమయంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో కౌంటింగ్ కేంద్రం దగ్గరకు చేరుకోవడంతో పరిస్థితి అదుపు తప్పకుండా పోలీసులు కట్టడి చర్యలు చేపట్టారు. మొదట ఐదు రౌండ్స్ వరకు బీఆర్‌ఎస్ లీడ్ రావడంతో పార్టీ శ్రేణుల్లో జోష్ కనిపించింది. ఆ తర్వాత వెలువడిన రౌండ్లలో కాంగ్రెస్‌కు లీడ్ రావడంతో బీఆర్‌ఎస్ కార్యకర్తలు వెనుదిరిగారు. కాంగ్రెస్ లీడ్‌లోకి వచ్చిన తర్వాత కౌంటింగ్ కేంద్రం దగ్గరకు వచ్చే ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు నృత్యాలు చేశారు.

### 350 మంది పోలీసులతో..

కౌంటింగ్ కేంద్రం దగ్గర పోలీసులను భారీగా మోహరించారు. ఏఎస్పీ రాములుతోపాటు మహబూబ్‌నగర్ డీఎస్పీ మహేష్ బందోబస్తును దగ్గరుండి పర్యవేక్షించారు. కేంద్ర సాయుధ బలగాలు, స్పెషల్ పార్టీ పోలీసులు, యూపీ బలగాలు బందోబస్తు నిర్వహించారు. దాదాపు 350 మంది పోలీస్ సిబ్బంది ఓట్ల లెక్కింపు కోసం విధులు నిర్వహించారు. కౌంటింగ్ ప్రక్రియ ముగింపు తర్వాత అభ్యర్థులు బయటకు వస్తున్న సమయంలో గేట్ దగ్గరకు ఒక్కసారిగా కార్యకర్తలు భారీగా చేరుకోవడంతో పోలీసులు అదుపు చేశారు.

### టెన్షన్.. టెన్షన్

**పాలమూరు:** మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా ఇటు పోటీ చేసిన అభ్యర్థులతోపాటు ద్వితీయ శ్రేణి నాయకులు.. పార్టీల కార్యకర్తలు ఇలా ప్రతిఒక్కరిలో టెన్షన్ కనిపించింది. ఉదయం రౌండ్ మొదలు కావడానికి కొన్ని క్షణాల ముందు అయితే కౌంటింగ్ దగ్గర బిజీబిజీగా గడిపారు. మొదటి రౌండ్ ప్రారంభమైన తర్వాత ఫలితాలను మైక్ ద్వారా చెప్పడంతో కౌంటింగ్ కేంద్రం పరిసర ప్రాంతాల్లో ఎదురుచూస్తున్న కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేశారు. మొదట బీఆర్‌ఎస్ అభ్యర్థులు ముందంజలో దూసుకుపోవడం చూసి పార్టీ కార్యకర్తలు జోష్ చూపించారు. ఆ తర్వాత వెలువడిన ఫలితాలను చూసి కాంగ్రెస్ శ్రేణులు భారీగా కేరింతలు కొట్టారు. మరోవైపు కౌంటింగ్ కేంద్రానికి వచ్చిన వాళ్లు ఫోన్ల ద్వారా స్నేహితులు, ఆప్తులు, ఇతర కార్యకర్తలకు సమాచారం ఎప్పటికప్పుడు చేరవేశారు. ఎన్నికల ఫలితాలు మొత్తం ఫోన్ల ద్వారా బయటి వ్యక్తులకు సెకన్ల వ్యవధిలో వెళ్లింది. కౌంటింగ్ కేంద్రం దగ్గర ప్రతిఒక్కరు ఫోన్లు వాడటం వల్ల నెట్‌వర్క్ పని చేయలేదు.



పీయూలోని కౌంటింగ్ కేంద్రం వద్ద కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను అదుపు చేస్తున్న పోలీసులు

## అచ్చొచ్చిన అచ్చంపేట

- ఇక్కడ గెలిచిన పార్టీదే రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు
- తాజాగా మరోసారి పునరావృతమైన చరిత్ర

**అచ్చంపేట:** అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని అచ్చంపేటకు ఉన్న ప్రత్యేకతను మరోసారి నిలబెట్టుకొంది. అచ్చొచ్చిన నియోజకవర్గంగా గుర్తింపు పొందిన అచ్చంపేట 2009 ఎన్నికల్లో ఒకే ఒక్కసారి చరిత్రను తిరగాసి టీడీపీ అభ్యర్థికి పట్టం కట్టారు. తిరిగి 2014, 2018 ఎన్నికల నుంచి పాత పద్ధతికి పట్టంకడుతూ వస్తోంది. తాజాగా 2023 ఎన్నికల్లో సైతం మరోసారి రుజువు చేసింది. అచ్చంపేట అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణ గెలుపొందగా.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుకు పూర్తి మెజార్టీ స్థానాలు వచ్చాయి. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు 64, బీఆర్‌ఎస్‌కు 39, బీజేపీ 8, ఎంఐఎం 7, సీపీఐ ఒక అసెంబ్లీ స్థానాలు దక్కించుకోవడంతో ప్రభుత్వ ఏర్పాటుకు సంపూర్ణ మెజార్టీ లభించింది.

**2009 ఎన్నికల్లో..**

2009 అసెంబ్లీ ఎన్నికల్లో అచ్చంపేట సెంటిమెంట్ చెదిరింది. ఈ ఎన్నికల్లో ఇక్కడి నుంచి టీడీపీ అభ్యర్థి రాములు గెలుపొందగా.. రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. రాష్ట్రవ్యాప్తంగా వైఎస్ ప్రభంజనం ఉన్నా ఇక్కడ మాత్రం 2009లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వంశీకృష్ణ ఓడిపోయి టీడీపీ నుంచి రాములు ఎన్నికై చరిత్రను తిరగరాశారు. ప్రస్తుతం జరిగిన ఈ ఎన్నికల్లో మరోసారి సెంటిమెంట్ పునరావతమైంది.

### 1962లో మొదటిసారిగా..

1952, 1957 సంవత్సరం వరకు నాగర్‌కర్నూల్, కల్వకుర్తి ద్విసభ నియోజకవర్గాలతో అచ్చంపేట కలిసి ఉండేది. 1962లో మొదటిసారిగా అచ్చంపేట అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పడింది. నాటి నుంచి ఈ నియోజకవర్గం షెడ్యూల్డ్ కులాలకు రిజర్వు చేశారు. పునర్విభజనలో సైతం ఈ నియోజకవర్గం తిరిగి మళ్లీ ఎస్సీలకే రిజర్వు అయ్యింది. 1962 నుంచి 2004 వరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అచ్చంపేట నియోజకవర్గం నుంచి ఏ పార్టీ అభ్యర్థి విజయం సాధిస్తే.. సదరు పార్టీ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కొత్త పార్టీలు ఆవిర్భవించినప్పుడు కూడా ఈ ఆనవాయితీ కొనసాగింది. టీఆర్‌ఎస్ ఆవిర్భావం తర్వాత అచ్చంపేట అసెంబ్లీకి జరిగిన మొదటి ఎన్నికల్లో ఇక్కడి నుంచి గెలుపొందిన పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేయడంతోపాటు రెండోసారి కూడా ప్రభుత్వం ఏర్పాటు అవుతుంది.

## నిరంజన్‌రెడ్డి కారు అద్దాలు ధ్వంసం

**బీఆర్‌ఎస్ నాయకుల ధర్నా.. స్తంభించిన ట్రాఫిక్**

**వనపర్తి టౌన్:** ఎన్నికల ఫలితాల అనంతరం తిరిగి వెళ్తున్న తాజా మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి కారుపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. దీంతో జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ చౌక్‌లో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు. నాయకుల ఆందోళనతో పట్టణంలో ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచిపోయింది. పోలీసులు నాయకులకు నచ్చజెప్పినా ఆందోళన విరమించలేదు. 2018లో నిరంజన్‌రెడ్డి 50 వేల పైచిలుకు మెజార్టీతో గెలుపొందిన ఎలాంటి దాడులను ప్రోత్సహించలేదని, ఎమ్మెల్యే అభ్యర్థిగా డిక్లేర్ కాకముందే మేఘారెడ్డి దాడులను ప్రోత్సహిస్తున్నారని దుయ్యబట్టారు. దాడి చేసిన నిందితులను అరెస్ట్ చేసే వరకు ఆందోళన విరమించమని భీష్మించి కూర్చున్నారు. బీఆర్‌ఎస్ శ్రేణులు ఆందోళన చేసే క్రమంలో జెడ్పీచైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి చివరి నిమిషంలో అక్కడి వచ్చి నిలబడగా.. మున్సిపల్ వైస్‌చైర్మన్ వాకిటి శ్రీధర్ మాజీ మంత్రికి మద్దతు ఇచ్చేలా ఉంటే ధర్నాలో కూర్చోవాలని, లేదంటే వెళ్లిపోవాలని కేకలు వేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ఎన్నికల నియోజకవర్గ సమన్వయకర్త ప్రమోద్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, నాయకులు నందిమల్ల అశోక్, శారద, మహేష్, మధులత, విజయ్, మురళీసాగర్, రాము, ఎం.రాము, యుగంధర్‌రెడ్డి, గిరి, కిట్టు తదితరులు పాల్గొన్నారు.



వనపర్తిలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

## తండ్రి కల నెరవేర్చిన తనయుడు

- 24 ఏళ్లుగా కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి పోరాటం
- మొదటిసారి పోటీచేసి గెలిచిన రాజేష్‌రెడ్డి



కూచుకుళ్ల దామోదర్‌రెడ్డితో రాజేష్‌రెడ్డి

**నాగర్‌కర్నూల్:** అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసి ఐదుసార్లు ఓటమి చవిచూసిన కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి కలను ఆయన కొడుకు కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి నెరవేర్చారు. పోటీ చేసిన మొదటిసారే గెలుపొందడం మరో విశేషం. కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి 1999లో మొదటిసారి స్వతంత్ర అభ్యర్థిగా ఎమ్మెల్యేకు పోటీ చేసి రెండో స్థానంలో నిలిచారు. 2004లో అప్పటి టీఆర్‌ఎస్ తరపున పోటీ చేసినా 1,449 స్వల్ప ఓట్లతో ఓటమి పాలయ్యారు. తర్వాత 2009, 2012 ఎన్నికల్లో సైతం నాగం జనార్దన్‌రెడ్డి చేతిలో, తెలంగాణ ఏర్పడిన తర్వాత 2014లో కాంగ్రెస్ తరపున పోటీ చేసి.. టీఆర్‌ఎస్ అభ్యర్థి మర్రి జనార్దన్‌రెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. అయితే 2005లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జెడ్పీ చైర్మన్‌గా, 2016, 2022లో ఎమ్మెల్సీ పదవులు దక్కినా ఎమ్మెల్యే పదవి మాత్రం అందని ద్రాక్షగా మారింది. అయితే తన కోరికను తన కొడుకు నెరవేర్చడంతో కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి ఆనందానికి అవధులు లేకుండాపోయాయి.

## 34 ఏళ్ల తర్వాత ఎగిరిన కాంగ్రెస్ జెండా..

**నాగర్‌కర్నూల్:** నాగర్‌కర్నూల్‌లో కాంగ్రెస్ అభ్యర్థి కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి విజయం సాధించడం ఒకింత సంచలనంగా చెప్పవచ్చు. సుమారు 34 ఏళ్ల తర్వాత నియోజకవర్గంలో కాంగ్రెస్‌జెండా ఎగరడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నిండింది. 1989లో కాంగ్రెస్‌పార్టీ తరుపున పోటీ చేసిన వంగ మోహన్‌గౌడ్ అప్పటి ప్రత్యర్థి నాగం జనార్దన్‌రెడ్డిపై విజయం సాధించారు. ఆ తర్వాత 1994, 1999లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి నాగం జనార్దన్‌రెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. 1999 ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా కూచకుళ్ల దామోదర్‌రెడ్డి పోటీచేసినా రెండో స్థానానికే పరిమితమయ్యారు. 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ తరుపున కూచకుళ్ల పోటీ చేయాల్సి ఉన్నా.. టీఆర్‌ఎస్ పార్టీతో పొత్తులో భాగంగా టీఆర్‌ఎస్ తరుపున పోటీ చేయాల్సి వచ్చింది. ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి నాగం జనార్దన్‌రెడ్డి చేతిలో కూచుకుళ్ల స్వల్ప మెజార్టీతో ఓటమి పాలయ్యారు. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ తరుపున కూచకుళ్ల పోటీచేసి టీడీపీ అభ్యర్థి నాగం చేతిలో ఓటమిపాలయ్యారు. తెలంగాణ ఉద్యమంలో భాగంగా 2012లో నాగం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయగా ఉప ఎన్నికలొచ్చాయి. ఈ ఎన్నికల్లో సైతం కూచకుళ్ల కాంగ్రెస్ తరుపున పోటీ చేసి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన నాగం చేతిలో ఓటమి పాలయ్యారు. 2014 ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థి మర్రి జనార్దన్‌రెడ్డి చేతిలో ఓటమిపాలయ్యారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున నాగం, టీఆర్‌ఎస్ తరుపున మర్రి జనార్దన్‌రెడ్డి పోటీచేయగా మర్రి జనార్దన్‌రెడ్డి గెలుపొందారు. నాటి నుంచి నేటి వరకు నాయకులు మారినా చాలామంది కార్యకర్తలు పార్టీని అంటిపెట్టుకునే ఉన్నారు. ఈసారి జరిగిన ఎన్నికల్లో 34 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ అభ్యర్థి కూచకుళ్ల రాజేష్‌రెడ్డి విజయం సాధించడంతో కాంగ్రెస్‌పార్టీలో జోష్ పెరిగింది.

## ఆరోసారి విజయం..

**కొల్లాపూర్:** మరోసారి కొల్లాపూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి విజయభేరి మోగించారు. ఆరోసారి ఎమ్మెల్యేగా గెలిచి జూపల్లి కృష్ణారావు రికార్డు సృష్టించారు. తన సమీప ప్రత్యర్థి బీఆర్‌ఎస్ అభ్యర్థి హర్షవర్ధన్‌రెడ్డిపై ఆయన 29,931 ఓట్ల తేడాతో గెలుపొందారు. ఆదివారం జరిగిన ఓట్ల లెక్కింపులో మొదటి నుంచి చివరి రౌండ్ వరకు జూపల్లి ఆధిక్యత కనబర్చారు. పెద్దకొత్తపల్లి మండలంతోపాటు కోడేరు మండలంలో కూడా కాంగ్రెస్‌కు ఆధిక్యత లభించడంతో కౌంటింగ్ కేంద్రం నుంచి ముందుగానే హర్షవర్ధన్‌రెడ్డి వెళ్లిపోగా.. జూపల్లి కృష్ణారావు మాత్రం చివరి వరకు అక్కడే ఉన్నారు. కౌంటింగ్ పూర్తయి విజయకేతనం ఎగురవేయడంతో కేంద్రం బయట భారీ గజమాలతో జూపల్లిని అభిమానులు సత్కరించారు. కౌంటింగ్ ముగిశాక బీఆర్‌ఎస్ చీఫ్ ఎలక్షన్ ఏజెంట్‌గా వ్యవహరించిన రంగినేని అభిలాష్‌రావు వాహనంపై కాంగ్రెస్ నాయకులు దాడికి పాల్పడ్డారు. కొల్లాపూర్ పట్టణంలో జూపల్లి కృష్ణారావు తనయుడు అరుణ్ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.



జూపల్లి కృష్ణారావును గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

## నల్లమల నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలు

**రాష్ట్ర రాజకీయాల్లో చక్రం తిప్పనున్న నేతలు**

**అచ్చంపేట:** నల్లమలలోని అచ్చంపేట నియోజకవర్గానికి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలయ్యారు. ఇదేంది అని ఆశ్చర్యపోతున్నారా.. అయితే ఈ వివరాలు ఒక్కసారి చూడండి.. అచ్చంపేట నియోజకవర్గానికి చెందిన ముగ్గురు వ్యక్తులు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి బరిలో నిలిచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అచ్చంపేట, కొడంగల్, వరంగల్ జిల్లాలోని పాలకుర్తి నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు వంశీకృష్ణ, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, యశస్వినిరెడ్డి అచ్చంపేట నియోజకవర్గానికి చెందినవారు. ముగ్గురు విజయం సాధించడంతో రాష్ట్ర రాజకీయాల్లో అచ్చంపేటకు ప్రత్యేక స్థానం లభించింది. ముఖ్యంగా అచ్చంపేట కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వంశీకృష్ణ అమ్రాబాద్ మండలం ఎల్మపల్లికి చెందిన వ్యక్తి కాగా.. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వంగూరు మండలం కొండారెడ్డిపల్లి వాసి. అలాగే వరంగల్ జిల్లా పాలకుర్తి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని యశస్వినిరెడ్డి వంగూరు మండలం డిండిచింతపల్లికి చెందిన మావిడాల మాధవి, తిరుపతిరెడ్డిల కుమార్తె. ఒకే నియోజకవర్గానికి చెందిన వీరు ఒకే పార్టీ నుంచి విజయం సాధించడంతోపాటు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీలో కీలకంగా వ్యవహరించనున్నారు. ఒకరు సీఎం అభ్యర్థి రేసులో ఉండగా.. మిగతా ఇద్దరు మంత్రులు అవుతారనే ప్రచారం జరుగుతోంది.



కుంభం శివకుమార్‌రెడ్డిని పట్టుకొని కన్నీటిపర్యంతమైన చిట్టెం పర్ణికారెడ్డి

## చిట్టెం పర్ణికారెడ్డి భావోద్వేగం

**నారాయణపేట:** సుమారు 18 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత తాతయ్య ఆశీర్వాదంతో నాన్న కల నెరవేరింది మామయ్య అంటూ డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డిని డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి పట్టుకొని భావోద్వేగంతో కన్నీటి పర్యంతమయ్యారు. కాంగ్రెస్ అభ్యర్థిగా పేట నుంచి బరిలో దిగిన ఆమె విజయం సాధించారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఇది నా గెలుపు కాదు.. మా మామయ్య 18 ఏళ్లుగా నారాయణపేటలో ప్రజలకు అందుబాటులో ఉంటూ మా నాన్న ఆశయాలను నెరవేరుస్తూ వేసిన పునాదులు. నా గెలుపు మా నాన్న కలకు.. మా తాతయ్య ఆత్మశాంతికి.. మా మామయ్య కుంభం శివకుమార్‌రెడ్డికి అంకితం అన్నారు. తమ కుటుంబంపై ఉన్న అభిమానంతో నన్ను గెలిపించిన అభిమానులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ఎమ్మెల్యేగా గెలిపించిన నారాయణపేట నియోజకవర్గ సకల జనుల సంక్షేమం.. అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు.

# ప్రజాతీర్పును శిరసావహిస్తా



మాట్లాడుతున్న తాజామాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

**వనపర్తి:** అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను ప్రాథమికంగా అంచనా వేస్తే ప్రజలు మార్పు కోరుకుంటున్నట్లు తెలుస్తోందని తాజామాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రజాతీర్పును శిరసావహిస్తానని పేర్కొన్నారు. 2014లో స్వల్ప ఓట్ల తేడాతో ఓడినా.. 2018లో భారీ మెజార్టీతో గెలుపొందినా.. ఓడినరోజు కృంగలేదు.. గెలిచిన రోజు ఉప్పొంగలేదన్నారు. స్థితప్రజ్ఞతతో ఉండి నియోజకవర్గ అభివృద్ధికి శ్రమించానని, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా, మంత్రిగా అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వందేళ్ల వరకు గుర్తుండేలా అభివృద్ధి చేశానన్నారు. నేను చేసిన పని చరిత్రలో నమోదైంది. ప్రజాక్షేత్రంలో గెలుపోటములు సహజమని, ఈ ఓటమి నా వ్యక్తిగతమైన దిగా భావించడం లేదన్నారు. ఈ ఎన్నికల్లో గెలిచిన మేఘారెడ్డి ఇది వరకు పని చేసిన ఎమ్మెల్యేలా మాదిరిగా ప్రజల శ్రేయస్సు కోసం పనిచేయాలని కోరుతున్నానని, సోదరుడు మేఘారెడ్డికి శుభాకాంక్షలు చెప్పారు.

## నోటాకు 21,701 ఓట్లు

**పాలమూరు:** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్న 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటర్లు చాలా వరకు నోటా వైపు వెళ్లారు. 12 నియోజకవర్గాలల్లో వెయ్యి మందికి పైగా ఓటర్లు నోటాకు మద్దతు ఇచ్చారు. అత్యధికంగా అచ్చంపేటలో 2,833 మంది నోటాకు ఓటు వేశారు. అత్యల్పంగా కల్వకుర్తిలో 661 మంది నోటాకు ఓటు వేయడం జరిగింది.

| నియోజకవర్గం పేరు | పోలైన ఓట్లు |
|---|---|
| మహబూబ్‌నగర్ | 1,157 |
| జడ్చర్ల | 1,655 |
| దేవరకద్ర | 1,706 |
| నారాయణపేట | 1,517 |
| మక్తల్ | 1,896 |
| కొడంగల్ | 2,002 |
| షాద్‌నగర్ | 1,389 |
| నాగర్‌కర్నూల్ | 1,122 |
| అచ్చంపేట | 2,833 |
| కొల్లాపూర్ | 1,037 |
| కల్వకుర్తి | 661 |
| వనపర్తి | 1,938 |
| గద్వాల | 775 |
| అలంపూర్ | 2,013 |

**పోస్టల్ బ్యాలెట్ ఓట్లు సాధించుకున్న ప్రధాన పార్టీలు**

| నియోజకవర్గం | బీజేపీ | బీఆర్‌ఎస్ | కాంగ్రెస్ |
|---|---|---|---|
| వనపర్తి | 151 | 526 | 1,646 |
| మహబూబ్‌నగర్ | 543 | 753 | 2,499 |
| గద్వాల | 136 | 377 | 1,022 |
| నాగర్‌కర్నూల్ | - | 283 | 1,048 |
| అచ్చంపేట | 66 | 350 | 1,576 |
| అలంపూర్ | 81 | 290 | 937 |
| కల్వకుర్తి | 479 | 209 | 800 |
| దేవరకద్ర | 60 | 157 | 642 |
| మక్తల్ | 226 | 100 | 310 |
| నారాయణపేట | 11 | 256 | 700 |
| కొల్లాపూర్ | 130 | 374 | 1,019 |
| జడ్చర్ల | 90 | 175 | 703 |

# పాలమూరు అభివృద్ధికి శ్రమించా..



కౌంటింగ్ కేంద్రం వద్ద బీఆర్‌ఎస్ అభ్యర్థులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ న్యూటౌన్:** పాలమూరు అభివృద్ధి గత పదేళ్లలో అహర్నిషలు పనిచేశానని, పురోగతిలో ఉన్న పనులతోపాటు మంజూరై ప్రారంభం కాని పనులను ముందుకు తీసుకెళ్లాలని తాజా మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం కలెక్టరేట్ సమీపంలోని ఫాంహౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో ప్రజల తీర్పును శిరసావహిస్తానని పేర్కొన్నారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఏర్పాటు కాబోయే ప్రభుత్వానికి శుభాకాంక్షలు చెప్పారు. ఎన్నికల్లో తన కోసం కష్టపడిన పార్టీ నాయకులు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటానన్నారు. విధి నిర్వహణలో ఏమైనా ఇబ్బంది పెట్టి ఉంటే తప్పుగా అనుకోవద్దని, పాలమూరును బాగు చేసుకునాలనే ఆలోచన తప్ప వేరే ఉద్దేశం లేదన్నారు. అసత్య ప్రచారం చేయడం ఎంతో బాధించిందని, భూములు, ఆస్తులు గుంజుకుంటే ఎవరైనా ఊరుకుంటారా అని ప్రశ్నించారు. ప్రజలకు పదేళ్లు సేవ చేసే అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ముడా చైర్మన్ వెంకన్న, మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, మార్కెట్ కమిటీ చైర్మన్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.